www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 12 ఏప్రిల్ 2025

5

పశ్చిమ గోదావరి



## స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రంలో..
## ఫుడ్ కమిషన్ సభ్యురాలు పర్యటన

**ప్రజాశక్తి - పాలకోడేరు**

ఎపి ఫుడ్ కమిషన్ సభ్యురాలు గండిమాల దేవి పాలకోడేరులో శుక్రవారం పర్యటించారు. శృంగవృక్షం ఉన్నత పాఠశాల, బాయ్స్ స్కూల్, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ చిన్నారులకు విద్యార్థులకు అందజేస్తున్న భోజనం, పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులు ఎక్కువ మంది భోజనం చేసేలా చూడాలన్నారు. ముఖ్యంగా కోడిగుడ్డు, రాగి జావ, చిక్కీలు వంటి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఆమె వెంట డిఇఒ. నారాయణ, ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

# 'చింతలపూడి' పూర్తి చేస్తాం

- చెరువులకు నీళ్లిచ్చేలా చర్యలు
- అవుటర్ రింగ్ రోడ్డుతో అభివృద్ధి ముందుకు
- మామిడి రైతులకు అండగా ఉంటాం
- ఆగిరిపల్లిలో 206 పేద కుటుంబాలకు మార్గదర్శకుల సాయం
- పి-4 ప్రజావేదికలో సిఎం చంద్రబాబు
- యాదవ, నాయీ బ్రాహ్మణ కుటుంబాల ఇంటికి వెళ్లి సమస్యలు అడిగిన సిఎం
- గత వైసిపి సర్కార్ కంటే ఘోరంగా మీడియాపై ఆంక్షలు



మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు


ట్రాక్టర్ నడుపుతున్న చంద్రబాబు

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఆగిరిపల్లి**

చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా, 2019లో టిడిపి ప్రభుత్వం రాకపోవడంతో పూర్తి కాలేదని, ఇప్పుడు సమస్య కోర్టులో ఉందని, సమస్యను పరిష్కరించి 'చింతలపూడి'ని పూర్తి చేసే బాధ్యతను తీసుకుంటామని సిఎం చంద్రబాబు తెలిపారు. నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మార్కెట్ యార్డ్‌లో పి-4 ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సిఎం చంద్రబాబు ఉదయం 10.45 గంటలకు వడ్లమానులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. సిఎంకు మంత్రులు కొలుసు పార్ధసారధి, సవిత, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్‌ఎలు బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, కామినేని శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్, మేయర్ నూర్జహాన్, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి, ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు, ముద్రబోయిన వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి సిఎంకు ఘనస్వాగతం పలికారు. ముందుగా యాదవ సామాజిక తరగతికి చెందిన నక్కబోయిన కోటయ్య ఇంటికి వెళ్లిన సిఎం వారి పశువుల పాకను పరిశీలించి గేదెలు, మేకల పెంపకం ద్వారా ఆదాయం ఏవిధంగా పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. తర్వాత నాయీబ్రాహ్మణులకు చెందిన బత్తుల జగన్నాథం క్షౌరశాలను సిఎం పరిశీలించారు. జగన్నాథంతో మాట్లాడి వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నారు. అత్యాధునిక పనిముట్లతో కూడిన కిట్‌ను సిఎం బహూకరించారు. అనంతరం మార్కెట్ యార్డ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్దకు సిఎం చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, సభా వేదికకు చేరుకున్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 99 వేల బంగారు కుటుంబాలు ఉండగా ఆగిరిపల్లిలో 206 కుటుంబాలు ఉన్నాయన్నారు.

**మెట్ట ప్రాంత అభివృద్ధికి సహకరించండి**
**మంత్రి పార్ధసారధి, ఎంపీ పుట్టా మహేష్**


జిల్లాలో నూజివీడు మెట్ట ప్రాంతమని, అభివృద్ధిలో వెనుకబడి ఉందని, సాయం చేయాలని మంత్రి పార్ధసారధి సిఎంను కోరారు. మెట్ట ప్రాంత భూములను సస్యశ్యామలం చేసేందుకు చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని కోరారు. పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి లిఫ్ట్‌లు ఏర్పాటు చేస్తే సద్గురు, కొమ్మూరు, మీర్జాపురం చెరువులకు నీళ్లందుతాయని, దాదాపు 25 వేల ఎకరాలు సాగవుతుందని తెలిపారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయడంతోపాటు ఏలూరులో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. భూముల ధరలు ఎక్కువగా ఉండటంతో పరిశ్రమల ఏర్పాటులో ఇబ్బంది ఉందని తెలిపారు. ఆగిరిపల్లి సచివాలయం-2 కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలోని జనాభా, అక్కడ స్థితిగతులను సిఎంకు వివరించారు. అగిరిపల్లిలో తలసరి కుటుంబ ఆదాయం రూ.2,06,403గా ఉందని తెలిపారు.

**గంటా 25 నిముషాలు సిఎం ప్రసంగం**

పి-4 కార్యక్రమంలో భాగంగా సిఎం చంద్రబాబు



మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి, ఎంపీ మహేష్‌కుమార్



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న సిఎం, మంత్రులు

దాదాపు ఒంటి గంటకు ప్రారంభించి 2.25 గంటల వరకూ దాదాపు గంటా 25 నిముషాలు ప్రసంగించారు. బిసిలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి, ఇళ్ల నిర్మాణాలతోపాటు అనేక అంశాలను ప్రస్తావించారు. ఆగిరిపల్లిలో 55 కుటుంబాలకు ఇంటి స్థలం లేదని, భూమి సేకరించి ఇళ్లు కట్టిస్తామని కలెక్టర్‌కు ఆదేశాలిస్తున్నట్లు తెలిపారు. 31 ఇళ్లలో మరుగుదొడ్లు లేవని, ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి సిఎం అధికారులకు తెలిపారు. 30 కుటుంబాలకు కుళాయి లేదని ఏర్పాటు చేయాలన్నారు. కరెంటు ఉన్నవారంతా సోలార్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 12 కిలోమీటర్ల సీసీ రోడ్లను మూడేళ్లలో పూర్తి చేస్తామని, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ 20 కిలోమీటర్లు పూర్తి చేస్తామని, వీధిలైట్లు లేనిచోట్ల ఏర్పాటు చేస్తామని సిఎం తెలిపారు. పి-4 కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 206 కుటుంబాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన ప్యారీ రేష్మ, బోనం లక్ష్మిదుర్గతో సిఎం మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోనం లక్ష్మి దుర్గకు భర్త చనిపోయి రెండేళ్లయినా పింఛన్ రాలేదని చెప్పడంతో వచ్చే నెల నుంచే పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను సిఎం ఆదేశించారు. మార్గదర్శకులుగా ముందుకొచ్చిన నూజివీడు సీడ్స్ అధినేత ప్రభాకర్, కుశలవ గ్రూప్ సిద్ధార్థ, హ్యాపీ వ్యాలీ స్కూల్ అధినేత గౌతమ్, నితిన్ సాయి కనస్ట్రక్షన్ నితిన్ కృష్ణ, మోడల్ డెయిరీ ఛైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కాలేజీ ఛైర్మన్ రావి వెంకట్రావు మాట్లాడుతూ పేద కుటుంబాలను పైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మార్గదర్శకులకు సిఎం శాలువా కప్పి సత్కరించారు.

**గ్రూపు రాజకీయాలపై చంద్రబాబు సీరియస్**

ఆగిరిపల్లిలో పి-4 కార్యక్రమం ముగిసిన తర్వాత టిడిపి నాయకులు, కార్యకర్తలతో సిఎం చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి మీడియాను అనుమతించలేదు. అంతర్గత సమాచారం ప్రకారం నూజివీడు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల గ్రూప్ రాజకీయాలపై చంద్రబాబు సీరియస్ అయినట్లు తెలిసింది. మంత్రి కొలుసు పార్థసారధి గ్రూప్, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు గ్రూపుల మధ్య ముదురుతున్న విబేధాలపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. గ్రూప్ రాజకీయాలకు స్వస్తి పలకకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించినట్లు తెలుస్తోంది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో దిగజారుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని తెలుగు తమ్ముళ్లను హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ విధానాలను ప్రజలు మెచ్చేవిధంగా ప్రతిఒక్క నాయకుడు కృషి చేయాలని సూచించినట్లు తెలిసింది.

### గత వైసిపి సర్కార్ కంటే ఘోరంగా మీడియాపై ఆంక్షలు

గత వైసిపి ప్రభుత్వంలో సిఎం పర్యటనలో మీడియాపై తీవ్రమైన ఆంక్షలు విధించేవారు. ప్రింట్ మీడియా ఫొటోగ్రాఫర్లు, ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్‌లకు మీడియా పాస్‌లు ఇచ్చేవారు కాదు. రిపోర్టులను సైతం తీసుకెళ్లి ఒకచోట కూర్చోపెట్టి, మళ్లీ తీసుకొచ్చేవారు. దీంతో గత ప్రభుత్వ తీరును జర్నలిస్టులు తీవ్రంగా వ్యతిరేకించినా పరిస్థితి కొనసాగింది. తాము అధికారంలోకి వస్తే మీడియాకు స్వేచ్ఛ కల్పిస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల్లో చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి పదినెలలు గడిచిపోయింది. జర్నలిస్టులపై ఆంక్షలు మాత్రం తొలగలేదు. సిఎం పోలవరం పర్యటనకు వచ్చినా ఇవే ఆంక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆగిరిపల్లి మండలంలో పి-4 కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రింట్ మీడియా ఫొటోగ్రాఫర్లకు, ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్‌లకు మీడియా పాస్‌లు ఇవ్వలేదు. హెలీప్యాడ్ వద్దకు ఏఒక్కరినీ రానివ్వలేదు. సిఎం బిసి కుటుంబాలను కలిసినా అక్కడికి మీడియాకు అవకాశం ఇవ్వలేదు. ప్రభుత్వం నియమించిన పిఆర్‌ఒలు ఏ ఫోటో ఇస్తే అదే పెట్టుకోవాలని, ఏది రాసిస్తే అదే ప్రచురించాలనే రీతిలో వ్యవహారం సాగుతోంది. గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులే ఈ విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో ఈ విధానం లేదు.

# పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని ధర్నా


కాళ్ల : జువ్వలపాలెంలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు



పాలకోడేరులో..

**ప్రజాశక్తి - కాళ్ల**

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. జువ్వలపాలెం సిపిఎం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మండా సూరిబాబు, తిరుమాని శ్రీనివాస్, గండికోట వెంకటేశ్వరరావు, గాతల ఆల్ ఫ్రెంచ్, తిరుమాని సుబ్బారావు, గాంధీ పాల్గొన్నారు.

**పాలకోడేరు :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ్య డిమాండ్ చేశారు. విస్సాకోడేరు రావి చెట్టు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారాలతో సామాన్య ప్రజలు ఎలా జీవించాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పాలన్నారు. పెరిగిన ధరలతో సతమతమవుతుంటే మళ్లీ గ్యాస్, పెట్రోల్చ డీజిల్ ధరలు పెంచడం దారుణమన్నారు. ధరలు తగ్గించాలని, లేకుంటే ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కలిదిండి గోపాలరాజు, సత్యానారాయణ, గోపి పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

## మంత్రి నిమ్మల రామానాయుడు, టీచర్ ఎంఎల్‌సి గోపీమూర్తి


పాలకొల్లులో మంత్రి నిమ్మల, కలెక్టర్ చేతుల మీదుగా బిసిలకు పనిముట్లు అందజేత



పాలకోడేరు : జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున గోపీమూర్తి, నేతలు


**ప్రజాశక్తి - పాలకొల్లు**

దేశ చరిత్రలో బిసిలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత టిడిపిది అని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతిని బస్టాండ్ సమీపంలో థియేటర్ వెనుక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సేవా కార్యక్రమంలో భాగంగా 50 మంది గీత కార్మికులకు మోకులు, పండ్లు, కూరగాయల వ్యాపారులకు ఉచితంగా తోపుడు బళ్లు అందజేశారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ బిసి అంటే టిడిపి, టిడిపి అంటే బిసి అనే విధంగా రాష్ట్రంలో పార్టీ గుర్తింపు తెచ్చుకుందన్నారు. చంద్రబాబు బిసిల సంక్షేమం, అభివద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ అనేక పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. అనంతరం బిసి, కార్పొరేషన్ ద్వారా రూ.3.50 కోట్ల సబ్సిడీ రుణాల చెక్కును అందజేశారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, కలెక్టర్ నాగరాణి, ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొన్నారు.

**భీమవరం :** నేటి ఉపాధ్యా యులు జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంఎల్‌సి గోపీమూర్తి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులతో పాటు నేటితరం పూలే బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిఎస్.విజయరామరాజు, గౌరవాధ్యక్షుడు సిహెచ్.పట్టాభి రామయ్య, జిల్లా కార్యదర్శి సిహెచ్.కుమార్, బాబ్జి, కె.రామకృష్ణప్రసాద్, డి.ఏసుబాబు, మండల నాయకులు బి.నాగబాబు ఎం.నరసింహయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి పి.సీతారామరాజు నాయకులు పాల్గొన్నారు.

# రొయ్యల ధర తగ్గించేస్తున్నారు

## మంత్రులకు జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం నేతల వినతి


మంత్రలకు వినతిపత్రాలు అందజేస్తున్న నేతలు

**ప్రజాశక్తి - పాలకొల్లు**

రాష్ట్రంలో రొయ్యల ధరలు దారుణంగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారని, అలాగే ఫీడ్ ధరలు దారుణంగా పెంచి అమ్ముతున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం నేతలు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడును, వారు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మను కలిసి తమ సమస్యలు వివరించారు. వెంటనే ప్రధాని అపాయింట్మెంట్ తీసికొని రైతులకు మేలు చేస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. రామానాయుడు సిఎం చంద్రబాబు దృష్టికి రొయ్య రైతుల ఇబ్బందులను తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. సంఘ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు సారథ్యంలో సంఘ నేతలు మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ఉత్పత్తులపై పన్ను తెచ్చినా అర్థరాత్రి యూనిట్లు దారుణంగా ధరలు తగ్గించి రైతులను దోచుకున్నారని చెప్పారు. ట్రంప్ 90 రోజులపాటు పన్నులు వాయిదా వేయగా ఇక్కడ మాత్రం ఇంకా తక్కువ ధరకే రొయ్యలు కొనుగోలు చేస్తున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు భవనం చినబాబు, కోడి విజయ భాస్కర్, మేకా ఫణి పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న షేక్ పాదుషా

**ప్రజాశక్తి - పెనుగొండ**

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు షేక్ పాదుషా అన్నారు. ఈ సందర్భంగా షేక్ పాదుషా శుక్రవారం నడిపూడిలో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడారు. కార్మికులు పనిచేసే చోట టెంట్, ప్రథమ చికిత్సా కిట్, తాగునీరు లేక మజ్జిగ వంటి కనీస అవసరాలు ఉండడం లేదన్నారు. గత సంవత్సరం పనిచేసిన వారికి పూర్తిగా వేతనాలు పడలేదని, పనిచేసే సమయంలో సీసా పెంకులు దిగుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ఈ సంవత్సరం ఉపాధి కూలీలకు కంటి తుడుపుగా కేవలం ఏడు రూపాయలు పెంచి రూ.307 వేతనం పెంచుతున్నామని తెలిపినా పని వేతనం కేవలం రూ.190 నుండి రూ.250లోపు మాత్రమే చెల్లిస్తున్నారని వాపోయారు. ఇకనైనా ఉపాధి కార్మికులకు కనీస వేతనం రూ.600 చెల్లించాలని, రెండు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. ˆమంలో ఉపాధి కూలీలు ఉన్నారు.

# వైఎన్‌లో తోలుబొమ్మల ప్రదర్శన

**ప్రజాశక్తి - నరసాపురం**

స్థానిక వైఎన్ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తోలుబొమ్మల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ధర్మవరం నుంచి విచ్చేసిన శ్రీ మారుతీ తోలు బొమ్మల ప్రదర్శన వారు, మారిషస్ తెలుగు సాంస్కృతిక వారసత్వ కళాపీఠం వారిచే శ్రీ మద్రామాయణం అనే ప్రాచీన తోలుబొమ్మలాటను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రెసిడెంట్ చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ అంతరించిపోతున్న నాటక ప్రదర్శనల్లో తోలుబొమ్మలాట ఒకటని తెలిపారు. పూర్వం ఈ ప్రదర్శనల ద్వారా ప్రజల్లో అవగాహన, ఆలోచనా శక్తి పెంచి చైతన్యవంతులను చేసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేలా చేసేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అందే రామసతీష్, గవర్నింగ్ బాడీ సభ్యులు రెడ్డప్ప ధవేజీ, చేగొండి సత్యనారాయణ మూర్తి, ఆర్‌వి.సుబ్బారావు, ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, పీజీ డైరెక్టర్ నిమ్మల చింతారావు, డీన్ గంధం శ్రీ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

## సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు



తణుకులో ఆందోళన చేస్తున్న ముస్లిములు, సిపిఎం నేతలు



నరసాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

**ప్రజాశక్తి - తణుకు**

వక్ఫ్ బోర్డు అధికారాలను కుదించి మసీదుల ఆస్తులను వాటి ఆధీనంలో లేకుండా చేయాలని చట్టాన్ని సవరించారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కామన మునిస్వామి అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశంలో మతాల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. దేశం నుంచి ముస్లిములను వెళ్లగొట్టాలనే ప్రయత్నంలో ఆర్‌ఎస్ఎస్ ఉందన్నారు. ముస్లింల ఆస్తులపై వారికుండే హక్కులు రద్దు చేస్తే ముస్లిములు ఆర్థికంగా వెనుకబడతారని తెలిపారు. మసీదు ఆస్తులను స్వాధీనం చేసుకుని ప్రయివేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తూ ఈ సవరణను ఉద్దేశపూర్వకంగానే చేసిందని తెలిపారు. ముస్లిములు తమ హక్కుల రక్షణ కోసం చేసే పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రేలంగి గ్రామశాఖ కార్యదర్శి ఇల్లిందరపర్తి సత్యనారాయణ, ముస్లిం కమిటీ సభ్యులు షేక్ బాబ్జి, షేక్ ఆలీబాబా, షేక్ సల్మాన్, షేక్ భాషా, పాన్‌బేబి పాల్గొన్నారు.

**ఆకివీడు :** మత మౌఢ్యంతో మోడీ ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు డిమాండ్ చేశారు. బిల్లును నిరసిస్తూ జెఎసి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ముస్లిం, క్రైస్తవ, సిపిఎం ఇతర ప్రజాసంఘాల నాయకులు ప్రదర్శనగా వెళ్లి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని గతంలో ఉన్న విధానాన్ని యథాతథంగా అమలు జరిగేలా చూడాలన్నారు. ఎమ్‌డి సిద్దిక్ మాస్టర్ మాట్లాడుతూ ఈ బిల్లు వల్ల ముస్లిములు భద్రతాభావం కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో ఇస్లాం ప్రముఖులు డాక్టర్ బిలాల్, ఎమ్‌డి జిక్కి, సాహెజ్ మాస్టారు, వెంకీ అప్పారావు డోకల లక్ష్మి, బివి వర్మ, రవితేజ, డోకల లక్ష్మి, షేక్ వలీ, ఎస్.కిసింజర్ పాల్గొన్నారు.

**నరసాపురం :** అంజుమన్ ఎ మహాఫిజుల్ ఇస్లాం కమిటీ నరసాపురం ఆధ్వర్యంలో శుక్రవారం వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. పట్టణంలోని పంజా సెంటర్, పాత బజార్, మెయిన్ రోడ్డు, అంబేద్కర్ సెంటర్, మొగల్తూరు రోడ్డు మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఎఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంజుమన్ అధ్యక్ష కార్యదర్శులు బుల్లి మస్తాన్, దావుద్ ఖాన్, బడేవలి, ఖాజ, మౌలాలి ఖాన్, అయూబ్ ఖాన్, అసిఫ్, ఖాజీ ఇమ్రాన్, యూసఫ్, ఆలీ, బాషి, ఫెరోజ్, జఫర్,అలీష, బాజి, ఖాలిద్ పాల్గొన్నారు.

# గోస్తనీ కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టాలి

## తహశీల్దార్‌కు సిపిఎం వినతి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి - తణుకు రూరల్**

వేల్పూరు గోస్తనీ కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టి నీటి కాలుష్యాన్ని అరికట్టాలని సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ డివిఎన్ఎస్.అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ కార్యదర్శి వీరభద్రరావు మాట్లాడుతూ వేల్పూరు నుంచి యనమదుర్రు డ్రెయిన్‌లో కలుస్తున్న గోస్తనీ కాలువ 34 సంవత్సరాలుగా ఆధునికీకరణ పనులకు నోచుకోలేదన్నారు. కాలువ పూడుకుపోయి పంట కాలువ మాదిరిగా మారిందన్నారు. గ్రామంలో రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ఎంపీ యుపి పాఠశాల నంబర్-2 సమీపంలో దాదాపు 15 ఏళ్ల క్రితం పాత వంతెన తొలగించి కొత్త వంతెన నిర్మాణం చేపట్టినప్పటికీ పాత వంతెన స్తంభాలు ఇప్పటికీ తొలగించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల కాలువలో నీటి పారుదలకు అడ్డంకిగా మారిందన్నారు. కొద్దిపాటి వర్షాలకు కాలువ ప్రమాదకరంగా ప్రవహిస్తూ కాలువకు ఇరువైపు ఉన్న వ్యవసాయ పంట భూములు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఈ ప్రభావంతో దిగుబడి తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అధికారులు తక్షణం స్పందించి వేల్పూరు లాకులు నుంచి రేలంగి అప్పలమ్మ వంతెన వరకూ గోస్తనీ కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టి నీటి కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబటి రామకృష్ణ, కర్ణాటపు నరసింహారావు, కుడకా వీరభద్రరావు పాల్గొన్నారు.

# తాడేపల్లిగూడెంలో కేంద్ర బృందం పర్యటన



కేంద్ర బృందంతో చర్చిస్తున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

రాష్ట్రంలో రీసర్వే పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న తాడేపల్లిగూడెంలో ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు శుక్రవారం పట్టణంలోని 23వ వార్డులో కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కేంద్ర ప్రభుత్వ ఐఎఫ్ఎస్ అధికారి డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి, ఐఎఎస్ అధికారి నిరంజన్ కుమార్ సుదాన్ష పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రీసర్వే చేయడం వల్ల ఏమైనా ఇబ్బందులు ఏర్పడ్డాయా, ఎలాంటి ప్రయోజనాలు కలిగాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ విద్యుల్లత, సర్వే డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ కుమార్, రాజమండ్రి రీజినల్ డైరెక్టర్ బాలస్వామి, ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా సర్వే అధికారులు కె.జాషువా, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, పెంటపాడు తహశీల్దార్ ఎం.సీతారత్నం పాల్గొన్నారు.

## మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

### రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు



వీరవాసరం : నవుడూరులో జెండా ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

**వీరవాసరం** : నిబంధనల పేరుతో రైతులను దోచుకుంటున్న మిల్లర్ల దోపిడి విధానాన్ని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ డిమాండ్ చేసింది. అఖిలభారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నవుడూరులో నిర్వహించారు. లింగం సత్యనారాయణ జెండా ఆవిష్కరణ అనంతరం సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహరాజు అధ్యక్షతన జరిగిన రైతు సంఘం మండల కమిటీలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఫ్యూడలత్ జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అఖిలభారత కిసాన్ సభ 1936లో ఏర్పడిందన్నారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసే సమయంలో తేమ శాతం పేరుతో మిల్లర్లు రైతుల నుంచి ధాన్యాన్ని దోచుకున్నారంటూ విమర్శించారు. వచ్చే సార్వ సీజన్‌లో అటువంటి దోపిడీకి అడ్డుకట్టవేయాలని అధికారులను కోరారు. పొలమూరు డ్రెయిన్ ప్రక్షాళన చేసి పంట పొలాలను ముంపు భారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, రైతుసంఘం మండల కార్యదర్శి తాళ్లూరి హరిహర లక్ష్మణ్, యాళ్లబండి నారాయణమూర్తి, పాలా కోటేశ్వరరావు, కేతా జ్యోతిబసు, అయినంపూడి బాబురావు పాల్గొన్నారు. **పెంటపాడు** : రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం మండలంలోని యానాలపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మాదాసు శ్రీను అధ్యక్షతన జెండా ఆవిష్కరించారు. అనంతరం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగ సమస్యలు విపరీతంగా పెరిగాయని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, పండిన పంటకు గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. కార్యక్రమంలో తాడి సుబ్బయ్య, మరపట్ల దానయ్య, కర్రిసాయి రెడ్డి, తాడి ప్రసాద్, గాది వెంకట్రావు, సాధనాల ప్రసాద్, గిద్ద మధు, తాడి రాంబాబు, వీరబత్తుల రాము, మాదాసు రమేష్, కవల బాలాజీ, తాడి కుమారస్వామి, గిద్ద శ్రీను, వీరబత్తుల దానయ్య, వీరబత్తుల పుల్లారావు, మామిడి చెట్టు శ్రీను, నాళం అబ్బులు, వీరబత్తుల ఆంజనేయులు, వీరబత్తుల వేణుగోపాల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఘనంగా భరత్ పుట్టినరోజు వేడుకలు



కాళ్ల : రక్తదానం చేస్తున్న యువకులు

**కాళ్ల** : ఆంధ్రప్రదేశ్ ఉప సభాపతి, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు తనయుడు కనుమూరు భరత్ పుట్టినరోజు వేడుకలను పెదఅమిరం గ్రామంలో టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. పెదఅమిరం గ్రామ సర్పంచి దొక్కు సోమేశ్వరరావు, ఉండి డిసి ఛైర్మన్ తోట ఫణిబాబు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ధరణి బ్లడ్ బ్యాంక్‌కు 30 మంది నాయకులు రక్తదానం చేశారు. అనంతరం అరుణోదయ మనోవికాస కేంద్రంలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు గుండబత్తుల నాగేశ్వరరావు, ఆకివీడు డిసి ఛైర్మన్ గొర్రెల శివరామరాజు, టిడిపి నాయకులు పెన్మెత్స విశ్వనాధరాజు, సందాల రామరాజు(హోటల్ ట్రయస్ట్ బాబు), బూరాడ వెంకటకృష్ణ, బొండాడ పేట సర్పంచి గుడ్ల మధుసూదనరావు, కోపల్లె, పెదఅమిరం, వేంపాడు గ్రామాల ఉప సర్పంచులు బూడి వెంకట పద్మారావు, జక్కాని కిషోర్, వేగేశ్న సుమన్, దాట్ల వెంకటరామరాజు, అల్లూరి నాగరాజు పాల్గొన్నారు.

**ఉండి**: భరత్ జన్మదిన సందర్భంగా మండలంలోని కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మండలంలోని కోలమూరు శివాలయంలో మండల ఉపాధ్యక్షులు పేరిచర్ల కృష్ణంరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 108 కొబ్బరికాయలు కొట్టారు. ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మండల అధ్యక్షులు కమలెంబి నాగరాజు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 40 మంది రక్తదానం చేశారు. ఉండి కలిదిండి రామచంద్ర రాజు జన్మభూమి పార్క్ వద్ద కూటమి నాయకులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో చదువుతున్న 26 మంది బాలికలకు జనసేన నాయకులు దుస్తులు పంపిణీ చేశారు. టిడిపి కూటమి నేతలు పాల్గొన్నారు.

**పాలకోడేరు** : భరత్ జన్మదిన వేడుకలు మోగల్లు నీటి సంఘం అధ్యక్షులు కొత్తపల్లి వెంకట సూర్యనారాయణ రాజు(మొగల్లు బాబు) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కునదరాజు మురళీకృష్ణంరాజు, టిడిపి సీనియర్ నేత కొత్తపల్లి నాగరాజు కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు అందజేశారు. సర్పంచులు గొట్టుముక్కల వెంకట శివరామరాజు శివాజీ(రాజు), భూపతిరాజు వంశీకృష్ణమరాజు, మల్లిపూడి కృష్ణకుమారి, నాయకులు వత్ససాయి శ్రీనివాసరాజు, ఇందుకూరి బలరామకృష్ణంరాజు, గాదిరాజు సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

## సమాచార చట్టంపై అవగాహన

**వీరవాసరం** : సమాచారం చట్టంపై మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వద్ద ఉన్న సమాచారం మాత్రమే ఇవ్వగలమన్నారు. లేనిది ఇవ్వలేమన్నారు. ప్రశ్నావళి రూపంలో సమాచారం అడగకూడదన్నారు. వ్యక్తిగత సమాచారం కూడా కోరకూడదన్నారు. మీకు అవసరమైన సమాచారాన్ని కార్యాలయ రికార్డులలో పరిశీలించుకోవచ్చునన్నారు. ఇచ్చిన సమాచారం పట్ల సంతృప్తి పడని ఎడల అప్పీలేట్ అధికారిని సమాచారం కోరవచ్చునని తెలిపారు. డిటి సుబ్బారావు, ఆర్ఐ రూజ్‌వెల్ట్, పౌరులు పాల్గొన్నారు.

**కాళ్ల** : ఆర్‌టిఐకు సంబంధించిన సెక్షన్లను చర్చించి ఆర్‌టిఐ చట్టంను దుర్వినియోగం చేయకుండా సక్రమంగా ఉపయోగించాలని కాళ్ల తహశీల్దార్ జి.సుందర్ సింగ్ అన్నారు. శుక్రవారం కాళ్ల తహశీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌టిఐ అవగాహనా సమావేశానికి అన్ని కార్యాలయ సహాయక పౌర సమాచార అధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా కస్తూరిబాయ్ గాంధీ జయంతి

**మొగల్తూరు** : మండలంలోని కాళీపట్నం పడమర గ్రామంలో కస్తూరిబాయ్ మోహన్‌దాస్ గాంధీ 156వ జయంతి వేడుకలను శుక్రవారం ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు మాట్లాడారు. కస్తూరిబాయ్ నేటి మహిళలకు ఆదర్శమని, భారత రాజకీయ కార్యకర్త, భర్త ప్రోత్సాహంతో, కుమారునితో పాటు భారత స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారన్నారు. దేశానికి స్వాతంత్రం సాధించడంలో ప్రముఖ పాత్ర ఆమె పోషించారన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో దొంగ శ్రీను, బసవని రెడ్డయ్య, సంఘాని డేవిడ్ రాజు, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్ పరిశీలన

**వీరవాసరం** : అంగన్‌వాడీలో పిల్లలు పాలు, గుడ్డు తీసుకోవడం లేదని, వాటిని ఇవ్వడం విరమించకూడదని ఎపి స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజి మాలాదేవి సూచించారు. అంగన్‌వాడీ సెంటర్ల పరిశీలనలో భాగంగా శుక్రవారం ఆమె పెర్కిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాకు వివరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోషణ వాటిక ఏర్పాటును అభినందించారు. పిల్లలతో కొంత సేపు గడిపి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం వంట చేస్తున్నది, లేనిది ఆరా తీశారు. వంటను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ డబ్బాల వినియోగాన్ని మానివేయాలన్నారు. ఈమె వెంట డిఇఒ నారాయణ, మిడ్డేమీల్స్ ఎడి సత్యనారాయణ, సిడిపిఒ లక్ష్మీకాంతం, డివైఇఒ నారగన రమేష్ పాల్గొన్నారు.

## సుబ్బరాజు చెరువుగట్టు నివాసితులకు ప్రత్యామ్నాయం చూపాలి

### సిపిఎం మండల కార్యదర్శి ఆశ్రియ్య

**పాలకోడేరు** : మొగుళ్లు సుబ్బరాజు చెరువు గట్టు నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రియ డిమాండ్ చేశారు. సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంతాన్ని శుక్రవారం ఆశ్రియ పరిశీలించి మాట్లాడారు. 23 కుటుంబాలు సుబ్బరాజు చెరువు గట్టుకు చేర్చి ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నారని తెలిపారు. రూపాయి రూపాయి కూడాబెట్టుకుని ఇక్కడే గృహాలు నిర్మించుకున్నారని తెలిపారు. ఈ నివాసాలు ఎవరికి అడ్డు కాదని, అయినా తొలగిస్తామని చెప్పడం దారుణమన్నారు. ఇప్పటికే ఈ సమస్యను డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, జిల్లా అధికారులకు విన్నవించడం జరిగిందన్నారు. వారు సమస్యపై సానుకూలంగా స్పందించారన్నారు. ఈ ప్రాంత వాసులకు ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. ఈయన వెంట సిపిఎం నేతలు, నివాసితులు ఉన్నారు.



# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

**ప్రజాశక్తి - ఆచంట**

బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం పాటుపడిన మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోతారని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి కార్యక్రమం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ బాలిక విద్యను ప్రోత్సహించే వితంతువులకు ఆశ్రయం కల్పించి మహిళా పాఠశాలలను స్థాపించి, మహిళల కోసం విద్యను బోధించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, బీర నరసింహమూర్తి, జి.శ్రీనివాస్, కేత నాగ ఆంజనేయులు, కేతా మురళీ, వెంకటేశ్వరరావు, సూర్య ప్రకాష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### ఘనంగా పలుచోట్ల జయంతి కార్యక్రమాలు



ఆచంటలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



పెనుమంట్రలో..

**పెనుమంట్ర** : సమాజానికి సామాజిక, విద్యాపరంగా మహాత్మా జ్యోతిరావు పూలే అందించిన సేవలు నిరుపమానమని ఆచంట నియోజకవర్గ బిసి సెల్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ కడలి సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం మార్టేరు సెంటర్లో ఆయన ఆధ్వర్యంలో జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పెనుమంట్ర మాజీ వైస్ ఎంపిపి కట్టా బాలాజీ వనకుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు పాలా ప్రసాద్, కె.లక్ష్మీ నారాయణ, ఒఎన్‌జిసి చీఫ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, గుబ్బల వెంకటేశ్వర రావు ప్రసంగించారు.

**నరసాపురం** : మహాత్మా జ్యోతి రావు పూలే 198వ జయంతి సందర్భంగా నరసాపురంలోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు వనమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వనమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావు పూలే నిమ్న జాతుల అభివృద్ధి కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గ యువజన సంఘం అధ్యక్షులుగా మోకా శంకర్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ ఛైర్మన్ రేవు శ్రీనివాస్, పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షులు పొనుమండ ముత్యాలరావు, పట్టణ అధ్యక్షులు సందక రామకృష్ణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వాక వరలక్ష్మి, నియోజకవర్గ యువజన అధ్యక్షులు మోకా శంకర్ పాల్గొన్నారు.



నరసాపురంలో..

**మొగల్తూరు** : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అంటరానితనాన్ని రూపుమాపిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని బిసి సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. మండలకేంద్రం మొగల్తూరులోని బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయ సమీపంలో, గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ఉన్న పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కుక్కల సత్యనారాయణ, పెంకే చంటి, మల్లాడి వెంకటేశ్వరరావు, మోటుపల్లి ముత్యాలరావు, కదలి చంటి, కండిబోయిన సుబ్రహ్మణ్యం, వాటాల కృష్ణమూర్తి, చెప్పల తాతారావు, అద్దంకి భాస్కరరావు, జక్కంశెట్టి రాంబాబు ఉన్నారు.



ఉండిలోని కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపి

**కెవిపిఎస్ ఆధ్వర్యంలో..**

**ఉండి**: కెవిపిఎస్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు మండలంలోని పాందువ్వలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి మాట్లాడుతూ కులమత వివక్షతలు వ్యతిరేకంగా అంటరానితనం, మహిళల అణిచివేత, సామాజిక అసమానతలు, దేశంలో పేరుకుపోయిన సాంఘిక దురాచారాలన్నింటినీ రూపుమాపడానికి 175 ఏళ్లకు ముందే ఉద్యమించిన తొలి సంఘసంస్కర్త, గొప్ప సామాజిక విప్లవవాది మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శం కావాలన్నారు. కెవిపిఎస్ నాయకులు ఎం.ప్రశాంత్, చిట్టిబాబు, అంగన్వాడీ సిబ్బంది సత్యవతి, అనురాధ, సుప్రియ, రాజేశ్వరి పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి

**ప్రజాశక్తి - మొగల్తూరు**

ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఒ బి.ఊర్మిళ అన్నారు. మండలంలోని కొత్తోటలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు వెయ్యి రోజులు సంరక్షణ, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. మునగాకు విశిష్టతను వివరించారు. సర్పంచి పడవల సత్యనారాయణ, ఎంపిటిసి లింగం ఏసుబాబు, సూపర్వైజర్లు బి.శ్రీదేవి, పి.విజయ్ కుమారి, ఆశ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

**పెనుగొండ** : గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు బలమైన పౌష్టికాహారంతో కూడిన ఆహారం తీసుకోవాలని అంగన్వాడీ టీచర్ కె.తులసి అన్నారు. పెనుగొండ సచివాలయ పరిధిలోని జలం చెరువు అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

**కాళ్ల** : మండలంలోని సుభాష్ చంద్రబోస్ మాజీ సైనిక్ కాలనీ, ఏలూరుపాడు, మాలవాని తిప్ప గ్రామాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు శుక్రవారం జరిగాయి. కాళ్ళ, జువ్వలపాలెం సెక్టార్ల సూపర్వైజర్లు నిర్మల, హేమలత ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాల అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు సంరక్షణ వ్యవధి, పౌష్టికాహారం మెరుగుపడటం, పిల్లల పెరుగుదల వంటి వాటిపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, భాగ్యలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

### పోషణ్ పక్వాడలో ఐసిడిఎస్ అధికారులు

**తణుకు** : కౌమార దశలో ఉన్న కిశోరి బాలికలు, గర్భవతులు ఎక్కువ రక్తహీనతకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎం.అరుణకుమారి సూచించారు. శుక్రవారం పోషణ పక్వాడ నాలుగో రోజు కార్యక్రమంలో భాగంగా తణుకు మున్సిపాలిటీలోని ముత్యాల వారి వీధిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త జిఎం.రాజకుమారి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**పెనుమంట్ర** : పిల్లలలో పోషకాహార లోపం లేకుండా తొలి వెయ్యి రోజుల సంరక్షణ అత్యంత కీలకమని పెనుమంట్ర ఐసిడిఎస్ అధికారి అంగర కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం ఐసిడిఎస్ పోషణ పక్షోత్సవాల సందర్భంగా మండలంలోని పొలమూరు, మార్టేరు, నత్తా రామేశ్వరం సచివాలయాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిచారు. ఈ కార్యక్రమాల్లో అంగన్వాడీ సూపర్‌వైజర్ పి.వెంకట లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు వెలగల సరస్వతి, రాజ్యలక్ష్మి, అనంత కుమారి, పిల్లలు పాల్గొన్నారు.

**ఆకివీడు** : బాలింతలు ఆరోగ్యం పట్ల పూర్తి శ్రద్ధ తీసుకోవాలని, పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో పుట్టే విధంగా ఆహారం తీసుకోవాలని ప్రముఖ న్యూట్రిషన్ కెవికె శాస్త్రవేత్త డాక్టర్ డెబోరా సూచించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న పోషణ పక్వాడ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిఒ వాణి విజయరత్నం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు రాజశేఖర్, సూపర్వైజర్ రత్నకుమారి, సిబ్బంది, బాలింతలు పాల్గొన్నారు.

## మంగన్న ఆశయాలను కొనసాగించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**తాడేపల్లిగూడెం** : అమరుడు బురుసు మంగన్న మరణం వృథా కాదని, వారి ఆశయ స్ఫూర్తితో నేటి కార్యకర్తలు పనిచేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు పేర్కొన్నారు. అమరజీవి బొరుసు మంగన్న 75వ వర్ధంతి కార్యక్రమం దండగర్ర గ్రామంలో శుక్రవారం వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐల ఆధ్వర్యంలో కండెల్లి సోమరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా దండగర్ర గ్రామంలో అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన స్థూపానికి చింతకాయల బాబురావు, పార్టీ నాయకులు, వారి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ అమరవీరుడు బొరుసు మంగన్న జమీందారీ భూస్వాముల కబంధ హస్తాల్లో ఉన్న భూములను పేదలకు, పేద రైతులకు పంచాలని గొప్ప రైతాంగ పోరాటాలు నిర్వహించారన్నారు. ఆ స్ఫూర్తితో నేడు వామపక్ష పార్టీల కార్యకర్తలు కార్మిక, కర్షకుల, వ్యవసాయ కార్మికుల సమస్యల మీద నిరంతరం పోరాడుతున్నారని, రానున్న కాలంలో ఈ పోరాటాలు విస్తృతంగా నిర్వహించాలని, వామపక్ష పార్టీలు ఐక్య కార్యాచరణతో ముందుకెళ్లాలని, అందుకు యువత కమ్యూనిస్టు పార్టీల వైపు రావాలని ఆయన కోరారు. మండల కమిటీ సభ్యులు కండెల్లి సోమరాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ సిపిఎం నాయకులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు, శిద్దిరెడ్డి శేషు, గుత్తులు నరసయ్య, కండెల్లి రమేష్ బాబు, పీలా కోటేశ్వరరావు, అల్లు సుబ్బారావు, కరక వెంకటరావు, పోతు శ్రీను, చిట్టి ప్రసాద్, మిద్దే జాను, లచ్చిపతుల శ్రీను, తంగేటి శ్రీను, కండెపల్లి పైడిరాజు, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకట దుర్గారావు పాల్గొన్నారు.

## భారత రైల్వే వారోత్సవాలు ప్రారంభం

**భీమవరం టౌన్** : శ్రీవిజ్ఞానవేదిక, జంక్షన్ రైల్వే స్టేషన్ ఆధ్వర్యంలో జంక్షన్ స్టేషన్ హెల్త్ యూనిట్ ప్రాంగణంలో భారత రైల్వే వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. రైల్వే హాస్పిటల్ డాక్టర్ రమేష్, ఎస్ఎం.చక్రవర్తి మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రైల్వే వ్యవస్థ చాలా గొప్పదని, ఆర్థికపరంగా, ఉపాధిపరంగా ఎంతో అభివృద్ధి పథంలో ఉన్న భారత రైల్వే ప్రపంచ రైల్వే వ్యవస్థలోనే గుర్తింపు పొందిందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకు రైల్వే శాఖ సహకారంతో వారోత్సవాలు నిర్వహిస్తామని, ముగింపు రోజున డివిజన్ రైల్వే అధికారులకు, ఉత్తమ సేవాతత్పరులకు సత్కారాలు చేస్తున్నామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి న్యూటన్, ఉండపల్లి రమేష్ నాయుడు, జెడ్ఆర్ యుసిసి మాజీ సభ్యులు సుబ్రహ్మణ్యం, ఎస్‌కె.చాన్ భాషా పాల్గొన్నారు.

## పాత్రికేయులపై క్రిమినల్ కేసులు ఉపసంహరించుకోవాలి

### పలుచోట్ల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన ధర్నా, తహశీల్దార్‌కు వినతి

**ప్రజాశక్తి - తణుకు**

పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన హత్యకు సంబంధించి సాక్షి ప్రతికలో ప్రచురితమైన కథనానికి సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డితో పాటు ఆరుగురు పాత్రికేయులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం తణుకు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు ధర్నా నిర్వహించి, అనంతరం తహశీల్దార్ అశోక్‌వర్మకు వినతిని అందజేశారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించవద్దని, అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎపిడబ్ల్యుజె జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తులా భాస్కర్, ఎపిడబ్ల్యుజె జిల్లా మాజీ కార్యదర్శి కొడమంచిలి కృష్ణ, ఎపియూడబ్ల్యుజె చిన్న పత్రికల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమ్మి ఏడుకొండలు, తణుకు ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు బొండ రామ్‌కుమార్, పాత్రికేయులు పాల్గొన్నారు.

**ఉండి:** సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డి, మరో ఆరుగురు సాక్షి విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఉండి ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు దుండి కృష్ణమోహన్, చిట్టూరి జోషి డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం జర్నలిస్టులపై కేసులను ఉపసంహరించుకోవాలని మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి డిప్యూటీ తహశీల్దార్ రత్నకుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సాక్షి విలేఖరి రత్నరాజు, ప్రజాశక్తి విలేఖరి బొండాడ సత్యనారాయణ, విశాలాంధ్ర విలేఖరి కేశవ, ప్రైమ్ నైన్ రిపోర్టర్ మణికంఠ, 6 టివి రిపోర్టర్ బాలాజీ, సత్య గోదావరి రిపోర్టర్ వెంకటరమణ పాల్గొన్నారు. **పెనుగొండ** : జర్నలిస్టులపై కేసు నమోదు చేయడం భావప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని పెనుగొండ జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. జర్నలిస్టు పాల్గొన్నారు.

## సబ్సిడీపై యంత్ర పరికరాల పంపిణీ

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

ఎస్ఎంఎఎం స్కీమ్‌కి సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను మండలానికి మంజూరైన పరికరాలను రైతులకు పంపిణీ చేసినట్టు మండల వ్యవసాయాధికారి అడబాల జ్యోషిలా తెలిపారు. మొత్తంగా ఈ 20 పరికరాల నిమిత్తం పూర్తి ధర రూ.18,29,421 కాగా ఇందులో సబ్సిడీ మొత్తం రూ.7,84,990 అని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్ఎఫ్ఎస్ఎం స్కీమ్ ద్వారా 50 శాతం రాయితీపై వేసవి అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు మండలం మొత్తంగా మినుములు-45 క్వింటాలు, పెసలు 25 క్వింటాల విత్తనాలు పూర్తి ధర-రూ.9,55,000 కాగా అందులో సబ్సిడీ రూ.4,77,500పై ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎపిసిఎన్ఎఫ్ పథకం ద్వారా నవధాన్యాల కిట్లను రైతులకు పంపిణీ చేశామని అన్నారు.